క్లుప్తంగా

పన్ను వసూళ్లలో గిద్దలూరుకు రెండో స్థానం

గిద్దలూరు రూరల్: ఆస్తి పన్ను వసూళ్లలో జిల్లాలోనే గిద్దలూరు నగర పంచాయతీ రెండో స్థానంలో నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను నగర పంచాయతీలోని అన్ని రకాల ఆస్తి పన్నులు రూ.4.67 కోట్లు వసూలు కావాల్సి ఉండగా రూ.3.42 కోట్లు ఖజానాకు జమయ్యాయని కమిషనర్ ఐ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 73.37 శాతం వసూళ్లతో రాష్ట్రంలోనే 17వ స్థానంలో గిద్దలూరు నగర పంచాయతీ నిలిచిందని తెలిపారు. గత ఏడాది కంటే రూ.38 లక్షలు అధికంగా పన్ను వసూలు చేసినట్లు పేర్కొన్నారు. పన్ను వసూళ్లలో నిరంతరం శ్రమించిన మున్సిపల్ సిబ్బంది టపావలి, ఆదిరెడ్డి, బీవీ రంగారావును అభినందించారు.

నవోదయ ఫలితాలు విడుదల

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం జవహార్ నవోదయ విద్యాలయలో 6, 9వ తరగతి ప్రవేశ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. 9వ తరగతి ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు 3వ తేదీ ఉదయం 9.30 గంటలకు, 6వ తరగతికి ఎంపికైన విద్యార్థులు 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు తమ హాల్ టికెట్లతో పాఠశాలకు రావాలని ప్రిన్సిపల్ గణేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కంభం సీఐ

కంభం: నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కంభం సీఐ మల్లికార్జున హెచ్చరించారు. స్థానిక వైజంక్షన్‌లో మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోజూ వాహన తనిఖీలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

పెన్షన్ హక్కులు హరించడం దారుణం



మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

దర్శి: కేంద్ర ప్రభుత్వం పెన్షన్ హక్కులు హరించడం దారుణమని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభల్లో ఆమోదించుకున్న పెన్షన్ సవరణ బిల్లు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రమాదకరమని చెప్పారు. దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందితే చట్టం అవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కులను చట్టం హరిస్తుందన్నారు. పెన్షన్ సవరణ బిల్లును నేరుగా ప్రవేశ పెడితే అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న భయంతో ఆర్థిక బిల్లులో చొప్పించి పాస్ చేసుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే ప్రతిపక్షాలు బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంట్‌ను బహిష్కరించాయని తెలిపారు. ఒక వైపు పార్లమెంట్‌లో ఎంపీల జీత భత్యాలు 24 శాతం పెంచుకుని పెన్షనర్ల హక్కుల మాత్రం హరించడం శోచనీయమన్నారు. ఆర్థిక బిల్లు ప్రకారం ఇక నుంచి రెండు రకాల పెన్షన్లను అమల్లోకి తెస్తున్నారని, ఒక ఉద్యోగికి పదవీ విరమణ రోజు ఏ పెన్షన్ ఫిక్స్ అయిందో అదే పెన్షన్ జీవితాంతం అప్‌డేషన్ లేకుండా ఉంటుందని తెలిపారు. తర్వాత పీఆర్‌సీలో మరొక ఉద్యోగి రిటైరైతే అతనికి ఫిక్స్ అయ్యే పెన్షన్ అతని జీవితాంతం ఎదుగు బొదుగు లేకుండా అదే పెన్షన్ పొందాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు వై.కోటిరెడ్డి, తిరుపతి, స్వాములు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తీవ్ర కరువు మండలంగా కురిచేడు

కురిచేడు: రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల్లో 51 కరువు ప్రభావిత మండలాలను ప్రకటించారు. వాటిల్లో కురిచేడు మండలం తీవ్ర కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని వ్యవసాయ శాఖ ఏఓ పి.మధుబాబు తెలిపారు. డ్రౌట్ మేనేజ్‌మెంట్ మాన్యువల్ ప్రకారం రైతులకు అవసరమైన సాయం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



ఆనందంగా బయటకు వస్తున్న పది విద్యార్థులు

తాళ్లూరు: పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖ అధికారులు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. సోషల్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 820 మందికి 809 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను ఎంఈఓ–1 జి.సుబ్బయ్య, ఎంఈఓ–2 ఎల్.సుధాకర్‌రావు పర్యవేక్షించారు.



సీతారామ కళ్యాణం జరిపిస్తున్న అర్చకులు

వైభవంగా పట్టాభిరామస్వామి

ఆలయ వార్షికోత్సవం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కలలో వెలసిన పట్టాభి రామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. స్వస్తిశ్రీ చాంద్రమానేనా విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణా వసంత రుతు చైత్ర శుద్ధ తదియ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామానికి సంబంధించిన వారందరూ హాజరు కావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది, ఈ సందర్భంగా ఆలయం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య అర్చకుల వేదమంత్రాల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. కమనీయ దృశ్యాలు వీక్షించేందుకు భక్తులు భారీగా బారులు తీరారు. గ్రామ పురోహితులు కాకర్ల లక్ష్మీప్రసాద్ శర్మ బ్రహ్మత్వమున కడప జిల్లా బద్వేల్‌కు చెందిన ప్రముఖ సిద్ధాంతులు ఓరుగంటి సీతారామ శర్మతో పాటు వారి శిష్య బృందం ఆధ్వర్యంలో కళాన్యాస హోమం, యంత్ర స్థాపన, శిలా స్థాపన, అలంకారం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీగా అన్నదానం చేశారు. వేడుకల సందర్భంగా గ్రామంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పశువుల నీటితొట్లకు శంకుస్థాపన



తాళ్లూరు: శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో



నీటితొట్లకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

దొనకొండ: మండలంలోని బాదాపురం రహదారిలో వేసవిలో పశువులు నీటికి ఇబ్బంది పడకుండా నీటితొట్ల నిర్మాణానికి మంగళవారం అధికారులు శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఒక్కో తొట్టికి రూ.31 వేలు మంజూరైనట్లు ఏపీఓ టి.దేవయ్య తెలిపారు. గ్రామాల్లోని పశువులకు వేసవిలో ఇబ్బంది లేకుండా నీటితొట్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆదాం షఫీ, పశు వైద్యాధికారి కరిష్మా, క్లస్టర్ కోర్సు డైరెక్టర్ శ్యాంసన్ పాల్గొన్నారు.

తాళ్లూరు: వేసవి కాలం దృష్ట్యా మూగజీవాలకు నీటి తొట్ల నిర్మాణానికి భూమిపూజ చేశామని ఎంపీడీవో దారా హనుమంతురావు తెలిపారు. మండలంలోని వెలుగువారిపాలెంలో మంగళవారం అధికారులు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. 16 పంచాయితీలకు 16 నీటితొట్లు నిర్మించనున్నట్లు ఎంపీపీ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి 33 వేల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఏపీఓ మురళి తెలిపారు.

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కేవీజీ కీర్తి

దర్శి: నేటి ఫ్యాప్టో నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దర్శి జోన్ ఫ్యాప్టో సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కేవీజీ కీర్తి మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు సమానంగా తెలుగు మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు వి.జనార్దన్‌రెడ్డి, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు బి. వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, మండల శాఖ బాధ్యులు బి.శ్రీనివాసులు, దర్శి, ముండ్లమూరు, కురిచేడు ఏపీటీఎఫ్‌టీ మండల శాఖ బాధ్యులు రంగస్వామి, శ్రీను, వి.బాలనాయక్, నాయకులు పి.నజీర్, కె.రవీంద్రరావు, కె.తేజ, కె.నాగరాజు, సందు వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి, బి.రంగారావు పాల్గొన్నారు.

49 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 49 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 388 బేళ్లను తీసుకురాగా 339 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.250, సరాసరి ధర రూ.268.68 పలికింది. వేలంలో 12 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన వేలంలో గరిష్ట ధర రూ. 281 పలికింది. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 473 బేళ్లను తీసుకురాగా వాటిలో 406 బేళ్లను కొనుగోలు చేసి 67 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.240, సరాసరి రూ.266.56 పలికింది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

కనిగిరిరూరల్: ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు కాశిరెడ్డి కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అర్హులంతా పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి అర్హులందరికీ ప్రధానంగా డయాలసిస్ పేషంట్లకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రేషన్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

అనంతరం మొబైల్ రేషన్‌వాహనాన్ని తనిఖీ చేశారు. డీలర్లు, ఎండీయూ అపరేటర్లు కుమ్మక్కై కార్డుదారులకు మోసం చేస్తే సహించేది లేదని చైర్మన్ హెచ్చరించారు. రేషన్ పంపిణీ పై పేదలు ఫిర్యాదు చేస్తే సహించేది లేదన్నారు.

గడప దాటని గింజ!



గొట్లగట్టులో ఇంట్లో నిల్వ చేసిన అలసందలు, మినుములు

గిట్టుబాటు ధరపై మెట్టు దిగిరాని సర్కారు

- ఇళ్లలోనే మగ్గుతున్న మినుములు, అలసందలు, కందులు
- వ్యాపారుల సిండికేట్‌తో మరింత దిగజారిన ధరలు
- నాణ్యతపై సాకులు.. నాసిరకమంటూ మెలికలు
- పెట్టుబడి సొమ్ము చేతికొస్తే చాలన్న ఆశతో రైతులు



మంగాపురంలో ఇంట్లో మగ్గుతున్న కందులు

కొనకనమిట్ల:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతల గోడు పట్టించుకునేవారే కరువయ్యారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు కల్పించి, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు సంతోషించారు. కానీ నేడు ఆ పరిస్థితి కరువైంది. రైతులు పండించిన ధాన్యం కొంత మేర అమ్మకాలు జరిగినప్పటికీ ఇటీవల మార్కెట్ ధరలు లేక, కొనేవారు ముఖం చాటేయటంతో పలు చోట్ల మినుము, అలసంద, కందులు ఇళ్లలోనే మగ్గుతున్నాయి. మరో వైపు దళారుల దోపిడీతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గతంలో కన్నా ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు. కొనకనమిట్ల మండలంలో మినుము, అలసంద, కంది తదితర మెట్ట పైర్లు అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అలసంద, మినుము పంటలు సుమారు 15 వేల ఎకరాలకు పైగా, కంది 15 వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. అలసంద ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకు, మినుము 2 నుంచి 3 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కంది పంట ఓ రకంగా దిగుబడి వచ్చినప్పటికీ ఆశించిన ధర లేక ఇళ్లలోనే మూలుగుతన్నాయి. గత డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలకు పంట కొంతమేర దెబ్బతినడంతో పంట నాణ్యతపై సాకులు చెబుతూ తక్కువ ధరకు అడుగుతున్నారు. నాణ్యమైన అలసందలు క్వింటా ధర గత నెలలో రూ.6500 వరకు, మినుముల ధర రూ.7 వేల వరకు పలికింది. ప్రస్తుతం అలసందలు రూ.4,500 నుంచి రూ.5 వేలకు, కందులు రూ.7500 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి కూడా చేతికి రాదని, నష్టాలు తప్పవని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతు శ్రమను గుర్తించి మద్దతుగా నిలవాల్సిన ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కలిపించకుండా చోద్యం చూస్తోంది. కందులు కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రాలు ప్రకటించిన ప్రభుత్వం మద్దతు ధరను రూ.7550కి పరిమితం చేయడంతో రైతులు నిరాశకు గురయ్యారు. గతేడాది రూ. 9 వేల వరకు పలికిన కందుల ధరను ఈ ఏడాది ప్రభుత్వమే కుదించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల వరకు అలసంద, మినుము, కందులకు మార్కెట్ ధర బాగానే ఉన్నప్పటికి వ్యాపారులు కుమ్మక్కై, ధర పెరగనివ్వకుండా కుట్ర చేస్తున్నారు.

గిట్టుబాటు ధరలేక ఇళ్లలో నిల్వ



రైతులు పండించిన పంటలకు సరైన మార్కెట్ ధరలు లేక ఇళ్లలోనే నిల్వ ఉంచారు. మినుములు, అలసందలు, కందులు పండించిన రైతులకు ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవు. ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవటంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం కొనకనమిట్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో రైతులను ఆదుకుంటారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

– పి.నారాయణరెడ్డి, రైతు, గొట్లగట్టు



తక్కువ ధరకే వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

కేజీబీవీలో 11 వరకు దరఖాస్తుల స్వీకరణ

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు. 2025–26 సంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్(ఎంపీసీ)లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. మిగిలిన తరగతులకు సంబంధించి ఖాళీలను బట్టి దరఖాస్తులుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు.. 85007 23716, 8897710857ను సంప్రదించాలని సూచించారు.